సాక్షి

పల్నాడు

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



40,878 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 40,878 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 35,198 బస్తాల అమ్మకాలు జరిగాయి.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో 37.55 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు. ఇది 169 అడుగులకు సమానం. పవర్ జనరేషన్‌కు 12వేల క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5,527 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 292 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 15న జరగనున్న స్వాతంత్య్ర వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఆమె భర్త కత్తెర సురేష్‌కుమార్ పాల్గొననున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందినట్లు హెనీ క్రిస్టినా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్ సంస్థల తరఫున ఢిల్లీలో జరగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న హెనీ క్రిస్టినా ఈనెల 14న ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. ఆ తర్వాత తీన్‌మూర్తి మార్గంలోని ప్రధానమంత్రి సంగ్రహాలయ సందర్శన కార్యక్రమంలో పాల్గొంటారు. 15న ఎర్రకోటలో నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణ వేడుకల్లో పాల్గొంటారు.

ఏఎన్‌యూకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్

ఏఎన్‌యూ(గుంటూరు): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్–2024) సోమవారం సాయంత్రం విడుదల చేసిన ర్యాంకులలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్థానం దక్కించుకుంది. ఇందులో ఓవరాల్ యూనివర్సిటీ కేటగిరీలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 97వ స్థానాన్ని పొందింది. స్టేట్ యూనివర్సిటీ కేటగిరీలో 20 వ ర్యాంకును దక్కించుకుంది. ఫార్మసీ కళాశాలల విభాగంలో 63వ ర్యాంకును సాధించింది. విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ గంగాధరరావు హర్షం వ్యక్తం చేశారు.

హర్‌ఘర్ తిరంగా విజయవంతం చేయండి
– జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



నరసరావుపేట: జిల్లాలో ప్రతి ఒక్కరూ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తిరంగా కాన్వాస్ మీద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్, జాయింట్ సెక్రటరీ సాల్మన్ ఆరోక్యరాజ్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో కె.వినాయకం జైహింద్ అని రాసి తమ మద్దతు తెలిపారు. జిల్లా అధికారులందరూ ఈ కార్యక్రమం విజయవంతం అయ్యే విధంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. పలువురు జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు సెంట్రల్ ఎక్సైజ్ పెన్షన్ అదాలత్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలోని సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ టాక్స్, సెంట్రల్ జీఎస్టీ శాఖలలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సమస్యల పరిష్కారానికి పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గద్దె తిలక్, టి.వివేకానంద ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు కన్నావారితోటలోని కేంద్ర జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు పెన్షన్ అదాలత్ సమావేశం జరుగుతుందని తెలిపారు. అదాలత్‌లో కస్టమ్స్ అండ్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి



పెదకూరపాడు: ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. 75 త్యాళ్లూరు గ్రామానికి చెందిన కొల్లి కోటిరెడ్డి కుమారుడు వెంకటరెడ్డి (27) విద్యుత్ శాఖలో పనిచేస్తుంటాడు. కూటమి ప్రభుత్వం రాగానే చిరు ఉద్యోగులను తొలగించిన నేపథ్యంలో తమ్ముడు గోవర్ధన్‌రెడ్డితో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. ట్రాక్టర్ ద్వారా సొంత వ్యవసాయ భూమిలో పత్తి పంటలో గుంటక తోలి డొంక రోడ్డుకు ట్రాక్టర్ ఎక్కించే క్రమంలో అదుపు తప్పి పక్కనే ఉన్న బావిలో ట్రాక్టర్‌తో సహా పడిపోయాడు. పక్కనే ఉన్న తమ్ముడు గోవర్ధన్‌రెడ్డి అప్రమత్తమై గ్రామంలో సమాచారం ఇవ్వగా, స్థానికులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సహకారంతో నీరు తోడేసి, ట్రాక్టర్‌తోపాటు, వెంకటరెడ్డి మృతదేహాన్ని వెలికితీశారు.

జాతీయ పోటీల్లో పతకాలే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు
- జేఎన్‌వీలో ప్రారంభమైన ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు
- 4 రాష్ట్రాలు..8 జిల్లాల నుంచి 430 మంది క్రీడాకారులు హాజరు
- మద్దిరాల నవోదయ విద్యాలయంలో మూడు రోజులు క్రీడా పండుగ



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ పి అరుణ్‌బాబు, పక్కన వీరనారాయణ, ప్రిన్సిపాల్ నరసింహారావు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: జాతీయ క్రీడల్లో పతకాల సాధనే లక్ష్యంగా క్రీడాకారులు కృషి చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు అన్నారు. చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం సోమవారం జేఎన్‌వీ పరిధిలో జరిగే ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వేదికగా నిలిచింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. మూడు రోజులపాటు జరిగే ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ సత్తా చాటి జాతీయస్థాయి పోటీల్లో అర్హత సాధించేందుకు సిద్ధం అయ్యారు. ఇందు కోసం కాలికట్, కోలార్, మహబూబ్‌నగర్, నెల్లూరు, రాయచూర్, విశాఖపట్నం, షిమోగ, త్రిశూల్ ప్రాంతాలకు చెందిన 430 మంది క్రీడాకారులు, తమ పీఈటీలు, ఎస్కార్ట్‌లతో తరలివచ్చారు. తొలిరోజున పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేఎన్‌వీ విద్యాలయ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థినులు పూర్ణకుంభంతో హారతులిచ్చి సాదరంగా స్వాగతించారు. విద్యాలయం నుంచి క్రీడామైదానానికి చేరుకుని కళావేదికపై ప్రార్థన గీతాల్ని ఆలపించారు. స్వాగత నృత్యాలతో విద్యార్థినులు ఆహుతులను అలరించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తూ గౌరవ వందనం చేయగా, కలెక్టర్ స్వీకరించారు. తొలుత కలెక్టర్ పి అరుణ్‌బాబు క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, అతిథులతో కలసి క్రీడాజ్యోతిని వెలిగించి ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్ని ప్రారంభించారు.

నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలి

ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభ చూపే విద్యార్థులు సంపూర్ణమైన అభివృద్ధిని సొంతం చేసుకుంటారని వివరించారు. జీవితంలో గెలుపోటములు సమానంగా తీసుకునే సత్తా ఆటగాళ్లకే ఉంటుందన్నారు. విద్యార్థి దశలో క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలని..ఏ రంగంలోనైనా మనస్సు పెట్టి సాధన చేస్తే సాధ్యం కానిది లేదన్నారు. అధ్యక్షత వహించిన విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు మాట్లాడుతూ కఠోర సాధనే విజయానికి సోపానం అవుతుందన్నారు. పతకాలు సాధించాలంటే క్రీడల పట్ల ఆసక్తిని చూపి పోటీకి సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం తమ విద్యాలయంలో జరిగే పోటీల్లో గెలిచి జాతీయస్థాయిలో కీర్తిపతాకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ హుస్సేన్, జేఎన్‌వీ వైస్ ప్రిన్సిపాల్ రత్నాంబిక, జేఎన్‌వీ పీఈటీ కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, అయిరెడ్డి రవిప్రసాద్, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 12 మ్యాచ్‌లు

చిలకలూరిపేటటౌన్: జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులకు సోమ, మంగళ, బుధవారాల్లో జరిగే ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు మద్దిరాల పీఎంశ్రీ నవోదయ విద్యాలయం క్రీడామైదానంలో తొలిరోజు ఉత్సాహంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలకు 8 జెఎన్‌వీ క్లస్టర్లకు చెందిన 430 క్రీడాకారులు, 12 రిఫరీలు, 10 మంది పీఈటీలు, 40 మంది ఎస్కార్ట్‌లు వచ్చారు. హ్యాండ్‌బాల్ పోటీలను బాలుర, బాలికల వేర్వేరుగా అండర్–14, అండర్ –17, అండర్ –19 విభాగాల్లో నిర్వహించారు. సోమవారం మొత్తం 18 మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. అండర్ 14,17,19 విభాగాల్లో 9 జట్లు బాలుర, బాలికల విభాగంలో తొమ్మిది జట్లు పాల్గొన్నాయని పీఈటీ కిషోర్‌కుమార్ తెలిపారు.



తలపడుతున్న బాలికల జట్లు



హ్యాండ్‌బాల్ క్రీడలో పోటాపోటీగా ఆడుతున్న క్రీడాకారులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జీరో బిల్లులపై ఇసుక లోడింగ్

- అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు
- లారీ డ్రైవర్ల ఆరోపణ



అమరావతి: మండలంలోని వైకుంఠపురం ఇసుక ర్యాంపు అధికారులు అవినీతికి పాల్పడి కొన్ని వాహనాలకు మాత్రమే జీరో బిల్లులపై ఇసుక లోడ్ చేస్తున్నారని లారీ డ్రైవర్లు విమర్శిస్తున్నారు. వైకుంఠపురం రీచ్‌లో రోజుకు 600 నుంచి 700 వరకు టోకెన్లు ఇచ్చేవారు. గత వారంలో ఒక బండికి ఒక టోకెన్ మాత్రమే ఇచ్చేవారని మూడు రోజుల నుంచి పద్ధతి మారిందని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో బండికి మూడు నాలుగు టోకెన్లు ఇచ్చి ఒకే బిల్లు మీద రెండు సార్లు ఇసుక లోడ్ చేస్తున్నారని డ్రైవర్లు చెబుతున్నారు. ఈ రీతిలో జీరో బిల్లులు లోడింగ్ అవుతుంటే తాము క్యూలైన్‌లో ఉండడమే అవుతుందని లారీ డ్రైవర్లు అధికారులతో ఆదివారం వాగ్వాదానికి దిగారు. ఆదివారం తొమ్మిదో తేదీ బిల్లుతో లోడింగ్ చేస్తుండగా కొంతమంది డ్రైవర్లు గుర్తించి పట్టుకుని అధికారుల దృష్టికి తీసుకువెళితే తేలిగ్గా తీసుకుని ఇసుక అన్‌లోడ్ చేసి పంపిచేశారన్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇసుక రీచ్‌లో ఎలాంటి అక్రమాలు జరగకూడదని చెబుతున్నా అవినీతి జరుగుతుందని ఆరోపిస్తున్నారు. బండికి రూ.1000 తీసుకుని ఒక్కొక్క లారీకి మూడు నాలుగు టోకెన్లు ఇస్తున్నారని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోజుల తరబడి క్యూలైన్‌లో ఉండే తమకు న్యాయం చేయాలంటూ లారీ డ్రైవర్లు కోరుతున్నారు.

సర్దుపోటుపై సమరం



మంగళగిరి ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

- వెల్లువెత్తిన నిరసనలు
- తప్పులతడక జాబితాలపై ఆగ్రహం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్దాల్సిన టీచర్లు 600 మందే
- కానీ 1,200 మంది స్థానచలనానికి అధికారుల ప్రతిపాదన!
- ఇష్టారాజ్య బదిలీలను ఒప్పుకోబోమన్న ఉపాధ్యాయ సంఘాలు
- దిగొచ్చిన సర్కారు.. ప్రక్రియను వాయిదా వేస్తున్నట్టు ప్రకటన

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ గందరగోళంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆధారంగా ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల వారీగా సోమవారం విడుదల చేసిన సర్దుబాటు జాబితాలపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. సీనియార్టీని తుంగలో తొక్కి, విధుల్లో చేరిన తేదీకి బదులు పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకుని జాబితాలు తయారు చేశారని ఉపాధ్యాయవర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రాధాన్య పాయింట్ల కేటాయింపు గందరగోళంగా ఉందని టీచర్లు నిప్పులు చెరుగుతున్నారు.

సీనియార్టీ లెక్కింపుపై ఆందోళన

ఉపాధ్యాయుల సీనియార్టీ విషయంలో అధికారులు తీసుకున్న కొలమానంపై సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి ఒకే డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులను విధుల్లో చేరిన తేదీ, కేడర్ ఆధారంగా సీనియర్, జూనియర్‌గా పరిగణించాలి. అయితే అధికారులు వయస్సు ఆధారంగా సీనియార్టీని లెక్కించడం ఉపాధ్యాయుల అసహనానికి కారణమైంది.

బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన ఫ్యాప్టో

సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) సోమవారం ప్రకటించింది. జాబితాలు తప్పుల తడకగా ఉన్నందున ఉపాధ్యాయులెవరూ ఎంఈఓ కార్యాలయాల్లో జరిగే కౌన్సెలింగ్‌కు వెళ్లరాదని పిలుపునిచ్చింది.

విధివిధానాలు మార్చాల్సిందే

నిరసనలతో ప్రభుత్వం దిగి వచ్చింది. సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతానికి వాయిదా వేసినా, విధివిధానాలు మార్చకుంటే ప్రక్రియను ముందుకు వెళ్లనీయబోమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

ఎంఈఓ కార్యాలయాలకు పరుగులు

సర్దుబాటు జాబితాల విడుదలతో ఉపాధ్యాయులు సోమవారం ఎంఈఓ కార్యాలయాలకు పరుగులు తీశారు. ఈ జాబితాలపై విద్యాశాఖ అధికారులు అభ్యంతరాలు స్వీకరించారు. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు సోమవారం సెలవు పెట్టి మరీ ఎంఈఓ కార్యాలయాలకు వెళ్లారు. జాబితాలు అసంబద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 600 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉందని ప్రాథమికంగా గుర్తించినా విద్యాశాఖాధికారులు తీసుకున్న అస్తవ్యస్త విధానాలతో దాదాపు 1,200 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలగనుందని ఉపాధ్యాయ నాయకులు చెబుతున్నారు. దీంతో ఎంఈఓ కార్యాలయాల వద్ద ఉపాధ్యాయులు వాగ్వాదాలకు దిగారు. నిరసన వ్యక్తం చేశారు. గుంటూరు నగరంతోపాటు మంగళగిరి, తెనాలితోపాటు పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ఎంఈఓ కార్యాలయాలు సోమవారం టీచర్ల నిరసనలతో హోరెత్తాయి.



అభ్యంతరాలు సమర్పించేందుకు గుంటూరు ఎంఈఓ కార్యాలయానికి వచ్చిన టీచర్లు

ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 84 అర్జీలు స్వీకరణ



అర్జీదారు సమస్య వింటున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన వారి నుంచి 84 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, ఐసీడీఎస్ పీడీ ఉమారాణి వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్జీదారులు ఎదుర్కొంటున్న అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించాలని అన్నారు. రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని, అధికారులు ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

తాళ్లచెరువు రైతులను ఆదుకోవాలి

అచ్చంపేట మండలం తాళ్లచెరువుకు చెందిన సుమారు 300మంది రైతులు గతేడాది సుమారు 100 ఎకరాల్లో నకిలీ మిరప విత్తనాలు వేసి తీవ్రంగా నష్టపోయారు. వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తాం.

–రైతుసంఘం నాయకులు, రైతులు,



డబ్బుల కోసం ఫారెస్టు గార్డు వేధిస్తున్నాడు



2016లో ఇల్లు కొనుక్కొని కుటుంబంతో ఉంటున్నా. ఆ ప్రాంతానికి చెందిన ఫారెస్టు గార్డు మద్యానికి బానిసై తరచూ ఇంటిపైకి వచ్చి నీ ఇల్లు ఫారెస్టు పరిధిలో ఉందని, ఇది అక్రమం అంటూ డబ్బుల కోసం వేధిస్తున్నాడు. డబ్బులు ఇవ్వకపోతే ఇంటి వద్దనున్న సామాన్లు ధ్వంసం చేస్తున్నాడు.

–ఎస్.నవనీత్‌నాయక్, లేమల్లె, అమరావతి మండలం

అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోండి

నా కుమార్తెకు గుంటూరు ముత్యాలరెడ్డినగర్ ప్రాంతంలో ఎనిమిది సెంట్ల స్థలం ఉంది. స్థానిక రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో దీనిని నంద్యాల కోటిరెడ్డి తన భార్య మల్లిక పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ రిజిస్టర్ రద్దు చేయించి మళ్లీ నా కుమార్తె పేరుపై చేయించా. అయితే దీనికిగాను నాకు రూ.4.5లక్షలు ఖర్చు అయింది. సదరు స్థలాన్ని అక్రమంగా రిజిస్టర్ చేసిన జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లపై చర్యలు తీసుకోవాలి. నాకు నష్టపరిహారం ఇప్పించాలి.

–ఇ.గురవారెడ్డి, రిటైర్డు లెక్చరర్, నరసరావుపేట

కోర్టు తీర్పును తహసీల్దార్ పట్టించుకోవట్లేదు

నాకు పూర్వీకుల నుంచి వచ్చిన 2.15ఎకరాల పొలం ఉంది. దీనిని తన బంధువు ఒకరు రెవెన్యూ అధికారులను లోబర్చుకొని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. నేను కోర్టును ఆశ్రయించి ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయించా. తహసీల్దార్ అడంగల్‌లో ఎక్కించకుండా, పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా వేధిస్తున్నాడు.

–కంచేటి వెంకటనరసయ్య, పీసపాడు, క్రోసూరు మండలం

త్యాగం చిరస్మరణీయం

- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్
- క్విట్ ఇండియా అమర వీరులకు నివాళి



అమరవీరులకు అంజలి ఘటిస్తున్న మంత్రి మనోహర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిరూరల్: స్వాతంత్య్ర పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమానిది ప్రముఖ స్థానమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. 1942లో జరిగిన క్విట్‌ఇండియా ఉద్యమం సమయంలో పోలీసు కాల్పుల్లో ఆగస్టు 12న ఏడుగురు తెనాలి వీరులు అమరులు కావడం చరిత్రలో మరిచిపోలేని ఘట్టమని అభివర్ణించారు. క్విట్ ఇండియా ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినాన్ని తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న నేతృత్వంలో గాంధీచౌక్ వద్ద నుంచి రణరంగ చౌక్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. రణరంగ చౌక్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో అసువులు బాసిన ఏడుగురు అమరవీరుల స్థూపాల వద్ద పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. జేసీ భార్గవ్ తేజ, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మున్సిపల్ చైర్ పర్సన్ టి.రాధిక, వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి ఉన్నారు.

ఉద్యమ స్ఫూర్తిని చాటుదాం

తెనాలిఅర్బన్: స్వాతంత్య్రోద్యమంలో తెనాలికి ప్రత్యేక స్థానం ఉందని, ఆ ఉద్యమ స్ఫూర్తిని చాటుదామని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రణరంగచౌక్‌లోని క్విట్ ఇండియా ఉద్యమంలో అసువులుబాసిన వారి స్మారకార్థం నిర్మించిన స్థూపాలకు సోమవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రణరంగ చౌక్‌లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

రేవతికి తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారం



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన జాషువా సమైక్య వ్యవస్థాపకుడు అమృతపూడి రాజారావు కుమార్తె అమృతపూడి రేవతికి తెలుగు వెలుగు నంది జాతీయ గౌరవ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ అసోసియేటెడ్ విత్ నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ, విజయవాడ స్వచ్ఛంద సేవా సంస్థ సెప్టెంబర్ 15న విజయవాడలో జరిగే గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి కార్యక్రమంలో ఆమెకు పురస్కారం అందజేసి సత్కరించనున్నారు. వివిధ సాహితీ, సామాజిక సేవా రంగాల్లో చేస్తున్న కృషికి పురస్కారం అందినట్లు రేవతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కవులు, కళాకారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈతకు వెళ్లి.. శవమై తేలాడు!

చిలకలూరిపేటటౌన్: ఈతకు వెళ్లి వాగులో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం...పట్టణానికి చెందిన దార్ల జాన్‌బాబు (12) స్థానికంగా ఉన్న ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్లో ఆరో తరగతి అభ్యసిస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో తండ్రి కోటేశ్వరరావు అడ్డరోడ్డు సెంటర్లో పనిచేస్తున్న సులభ్ కాంప్లెక్స్ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో కోటేశ్వరరావు భార్య తండ్రి కొడుకులిద్దరికీ అక్కడికే భోజనం తీసుకువచ్చింది. భోజనం చేసేందుకు పెరుగు తీసుకురావాలని కుమారుడిని పంపించగా ఎంతకూ రాకపోవడంతో పలుచోట్ల వెతికి చివరకు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు ఉదయం ఓగేరువాగులో బాలుడి శవం తేలుతూ కనిపించడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తల్లి దార్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

స్టంట్ వేస్తారన్న భయం ఆత్మహత్యకు ఉసిగొల్పింది!

చిలకలూరిపేటటౌన్: గుండెకు స్టంట్ వేయించుకోవాల్సి వస్తుందన్న భయంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం... పట్టణానికి చెందిన గోవిందు శివరామయ్య (66) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల కాలంలో అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లగా గుండెకు స్టంట్ వేయాలని వైద్యులు చెప్పారు. దీంతో భయపడిన శివరామయ్య ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో ఎలుకల మందు కలుపుకుని సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చినకొండ్రుపాడులోని కాటూరి మెడికల్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నూజెండ్ల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌పై అక్రమ కేసు

- గృహ దహనం చేశారని...
- రాజకీయ కక్షతోనే అక్రమ ఫిర్యాదు
- ఐనవోలు పోలీస్ స్టేషను ఎదుట పార్టీ అభిమానుల, నాయకుల ఆందోళన



ఐనవోలు స్టేషను ఎదుట నాగిరెడ్డికి మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాక్కా నాగిరెడ్డితో పాటు పలువురు పార్టీ కార్యకర్తలపై ఐనవోలు పోలీస్ స్టేషనులో సోమవారం అక్రమ కేసు నమోదైంది. ఉప్పలపాడు గ్రామానికి చెందిన మేకల కోటమ్మ అనే మహిళ పూరిల్లు గత రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అయితే గ్రామానికి చెందిన ఇర్ల రామ కోటయ్య, హనుమంతురావు, చౌటూరి ఆదెయ్య, చలంచర్ల కోటేశ్వరమ్మ, కొమ్మతోటి సుజాత, వీరాంజనేయులు, వెంటనే స్పందించి ఇంటిలో ఉన్న కోటమ్మను కాపాడారు. అంతవరకు బాగానే ఉంది... తెల్లవారిన తరువాత నాగిరెడ్డి అగ్ని ప్రమాద బాధితులను కూడా పరామర్శించారు. కాగా ఎవరైయితే మంటలు ఆర్పి సహాయం చేశారో వారిపైనే పోలీసులు కేసులు నమోదు చేయడం గమనార్హం.

పోలీస్ స్టేషను వద్ద అభిమానుల ఆందోళన

నాగిరెడ్డిపై అక్రమ కేసు నమోదైందని తెలుసుకున్న గ్రామస్తులు అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఐనవోలు పోలీస్‌స్టేషను వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు.

ఇలాంటి అక్రమ కేసులు బనాయించడం మంచి సంస్కృతి కాదంటూ పోలీసుల వైఖరిని దుయ్యబట్టారు. గత 10 ఏళ్లగా నాగిరెడ్డి వైఎస్సార్ సీపీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ ఉన్నాడన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగనన్నతో మంచి సంబంధాలు కల్గిండటంతో రాజకీయంగా అణగదొక్కాలనే ప్రయత్నంలో భాగంగానే కుట్రపూరితంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని వారంతా అభిప్రాయపడ్డారు.

రాజకీయ కుట్రతోనే కేసు

నాగిరెడ్డి మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. కేవలం టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే తనపై అక్రమ కేసులు పెట్టారని, దీనిపై నిష్పక్షపాతంగా విచారణ చేసి వాస్తవాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు విషయమై పోలీసులను వివరణ కోరగా వివరాలు తరువాత తెలియజేస్తామన్నారు.

ఇదేమిటయ్యా.. ఫ్రాన్సిస్!!

పంచాయతీ సెక్రటరీ తీరే వేరు!

- సమాచారం ఇవ్వకుండానే విధులకు డుమ్మా
- ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా సచివాలయం మార్పు
- టీడీపీ నేత చెబితేనే చార్జ్ అప్పగిస్తాడట!
- సెలవు కావాలంటే టీడీపీ నేతల చేత ఫోను



ఫ్రాన్సిస్ ఖాళీ చేసిన జలాల్‌పురం సచివాలయ భవనం



పంచాయతీ కార్యాలయానికి చేరిన ఫర్నిచర్

పెదకూరపాడు: మండల పరిధిలోని లింగంగుంట్ల గ్రామ కార్యదర్శి తీరు మండల ఉన్నతాధికారులకు ఆగ్రహం తెప్పిస్తోంది. సక్రమంగా విధులకు, సమావేశాలకు హాజరుకాకుండా తన ఇష్టం వచ్చినట్లు ఆయన వ్యవహార శైలి ఉండటంతో ఎంపీడీవో మల్లేశ్వరి ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. వివరాల్లోకి వెళితే... లింగంగుంట్ల గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ఫ్రాన్సిస్ లింగంగుంట్లతో పాటు జలాల్‌పురం, గారపాడు గ్రామాలకు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించే ఆయన ఎన్నికల అనంతరం రూటు మార్చారు. జలాల్‌పురం గ్రామంలోని కొందరు టీడీపీ కార్యకర్తలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్మించిన గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించ వద్దని, గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించాలని మండల స్థాయి అధికారులకు విన్నవించారు. అయితే దీనిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. జిల్లా కలెక్టర్, పంచాయతీ అధికారి అనుమతులు లేకుండా సచివాలయ సిబ్బందిని గ్రామ పంచాయతీకి తీసుకెళ్లి విధులు నిర్వహింప చేయిస్తున్నారు. కార్యదర్శి చేష్టలకు తోటి సిబ్బంది సైతం అవాక్కవుతున్నారు.

టీడీపీ నేత చెబితేనే చార్జ్ అప్పగిస్తా!

గారపాడు గ్రామ రెగ్యులర్ కార్యదర్శి కమల వ్యక్తిగత పనులపై జూలై 26న సెలవు పెట్టారు. దీంతో ఎంపీడీవో తాత్కాలిక కార్యదర్శిగా గారపాడు గ్రామానికి ఫ్రాన్సిస్‌కు అప్పగిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. రెగ్యులర్ కార్యదర్శి కమల తిరిగి ఈ నెల తిరిగి 10వ తేదీన విధులకు హాజరయ్యారు. ఫ్రాన్సిస్‌ను చార్జ్ అప్పగించమని కమల కోరగా స్థానికంగా ఉన్న టీడీపీ నేత మక్కెన సాగర్ చెబితేనే చార్జ్ అప్పగిస్తానంటూ కమలతో



ఫ్రాన్సిస్

> ఆయనొక ప్రభుత్వోద్యోగి. విధి నిర్వహణలో, అధికారుల ఆదేశాల అమలులో ఒక విధి విధానంతో పని చేయాల్సి ఉంటుంది. కానీ లింగంగుంట్ల కార్యదర్శికి అవేమీ పట్టవు. తనకు తోచింది చేస్తాడు. అదేమంటే పచ్చనేతల గూటికి చేరి అక్కడి నుంచి 'ఆదేశాలు' జారీచేయిస్తాడు. ఆయన వ్యవహారశైలి మండల అధికారులకు తలనొప్పిగా మారడంతో చేసేది లేక చివరకు ఉన్నతాధికారులకు విన్నవించారు.

చెప్పడంతో ఆమె ఉన్నతాధికారులు దృష్టికి విషయాన్ని తీసుకు వెళ్లారు. అయినా ఇప్పటి వరకు కమలకు చార్జ్ అప్పగించలేదు. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. సీనియర్ అసిస్టెంట్‌ను ఫోన్‌లో వివరణ కోరగా 'ఫోను రికార్డు చేస్తున్నా' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు.

సెలవు కావాలంటే..

ఫ్రాన్సిస్‌కు సెలవు కావాలంటే ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తాలూకా అంటూ వేరొక వ్యక్తి ఎంపీడీవోకు ఫోన్ చేస్తాడు. లేదంటే ఈ నెల 5, 6 ,7 తేదీలో సెలవు మంజూరు చేయాలంటూ ఎంపీడీవోకి వాట్సప్‌లో మెసేజ్ పంపుతారు. ఫ్రాన్సిస్ తీరుపై విసుగుచెందిన ఎంపీడీవో ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

సమావేశాలంటే డోంట్‌కేర్

జనరల్ బాడీ సమావేశమైనా, కార్యదర్శులకు శిక్షణ తరగతులైనా ఫ్రాన్సిస్ మాత్రం హాజరుకాడు. ఇదేమిటయ్యా... ఫ్రాన్సిస్ అంటూ తోటి సిబ్బంది చర్చించుకోవడం గమనార్హం.

ఫ్రాన్సిస్‌పై ఆరోపణలు వాస్తవమే



లింగంగుంట్ల కార్యదర్శి ఫ్రాన్సిస్‌పై వస్తున్న ఆరోపణలు వాస్తవమే. సమాచరం లేకుండా విధులకు గైర్హాజరు అవుతున్నారు. జనరల్ బాడీ సమావేశాలు, శిక్షణ తరగతులకు హాజరుకావడం లేదు. ఉన్నతాధికారులు అనుమతి లేకుండా గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించకుండా, పంచాయతీ కార్యాలయానికి సిబ్బందిని తరలించారు. అందుకే చర్యలు తీసుకోమని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశాం.

–మల్లేశ్వరి, ఎంపీడీవో, పెదకూరపాడు

ఫిర్యాదు చేసినందుకు
పోలీసులే వేధిస్తున్నారు!!

- పోలీసు ఉన్నతాధికారులకు దొండపాడు వాసి వినతి
- జిల్లా పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ



జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదుచేస్తున్న బాధితులు

నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఎస్పీ కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి హాజరైన బాధితుల ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర పాల్గొన్నారు.

నా భర్త హెడ్‌కానిస్టేబుల్ వేధిస్తున్నాడు



నాకు, శావల్యాపురంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాబుతో 2010లో వివాహమైంది. ముగ్గురు మగబిడ్డలు పుట్టగా ఒకరు చనిపోయారు. దాచేపల్లి, మాచర్ల, గురజాలలో కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో నా భర్త దాచేపల్లి కోర్టుకు వచ్చిన యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పటి నుంచి నన్ను వేధిస్తున్నాడు. వివాహేతర సంబంధం పెట్టుకున్న ఆ యువతిపై చర్యలు తీసుకోండి. నాకు న్యాయం చేయండి.

–ఆర్.శివనాగమల్లేశ్వరి, వినుకొండ పట్టణం

ఆడపిల్లలు పుట్టారని ఏలుకోడట!



నాకు బాల మీరావలితో 2012లో వివాహమైంది. మొదటి కాన్పులో ఇద్దరు కవల ఆడపిల్లలు పుట్టారు. రెండు, మూడో కాన్పుల్లో మరో ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. దీంతో నా భర్త ఇంటి వద్ద నుంచి రూ.2 లక్షలు తీసుకురావాలని, లేకపోతే ఇల్లు విడిచి వెళ్లిపోవాలని వేధిస్తున్నాడు. పోలీసులకు ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోలేదు. నాకు న్యాయం చేయండి.

–షేక్ నాసరభీ, దాచేపల్లి

ఫిర్యాదు చేస్తే పోలీసులే కొట్టారు!

యడ్లపాడు నుంచి కొండ్రుపాడు గ్రామాలకు వెళ్లే దారిలో వ్యభిచారం విపరీతంగా జరుగుతోంది. ఆ రోడ్డులోని మూడు ప్రదేశాల్లో యువతులు రోడ్డుపై నిలబడి విటులను ఆకర్షిస్తున్నారు. దీనిపై తాను యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదుచేస్తే వారు నన్ను కొట్టారు. అలాగే ఇటీవల అక్రమ మద్యంపై కూడా ఫిర్యాదుచేసినందుకు కొట్టారు. వారిపై చర్యలు తీసుకొని నాకు రక్షణ కల్పించండి.

–ఎం.భానుప్రసాదు, దొండపాడు, నరసరావుపేట మండలం

గొర్రెలు దొంగిలించినా న్యాయం జరగలేదు



ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంటి వద్దనున్న రూ.5 లక్షలు విలువైన 22 గొర్రెలను దొంగలు దొంగిలించారు. దీనిపై మండల పోలీసులకు ఫిర్యాదు చేశా. ఇప్పటివరకు న్యాయం జరగలేదు. మీరైనా స్పందించి న్యాయం చేయాలి.

–చిట్టేడు సుజాత, ఆరేపల్లి ముప్పాళ

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి

- వచ్చే 100 రోజుల ప్రణాళిక ప్రతీ విభాగంలో తయారు చేయండి
- కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట: జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలో రూపకల్పనకు నివేదికల సిద్ధం చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వారితో మాట్లాడారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. రాబోయే వంద రోజుల్లో ప్రజలకు ఏ కార్యక్రమాల అమలు చేస్తున్నారనే దానిపై నివేదికలు సిద్ధం చేసుకోవాలని, జిల్లాలో ఎటువంటి బాధాకర సంఘటనలు జరగకుండా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని పనులు చేపట్టాలని కోరారు. మండలాల ప్రత్యేక అధికారులు వారానికి ఒక్క రోజు శుక్రవారం హాస్టళ్లు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రులు తనిఖీలు చేసి సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మాతృ శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించి శాఖల సమన్వయ సమావేశం నిర్వహించుకోవాలన్నారు. కిందిస్థాయి సిబ్బందితో సమన్వయంతో చేసుకుని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండి ముందుకు సాగాలని కోరారు. కోర్టు కేసులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో కౌంటర్ ఫైల్స్, అప్పీల్ దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై 'మీకు తెలుసా' పోస్టర్ ఆవిష్కరణ

జిల్లాలో ఎనిమిది వారాల పాటు అవగాహన



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్ గనోరే

నరసరావుపేట: రాష్ట్రంలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఎనిమిది వారాల పాటు నిర్వహించే మీకు తెలుసా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, వైద్యశాఖ అధికారులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. నాక్ నేతృత్వంలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్ర సంస్థ ఆదేశాల మేరకు కార్యక్రమం క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు డీఎల్ఏటీవో డాక్టర్ మురళి పేర్కొన్నారు. హెచ్‌ఐవీపై రూపొందించిన వివిధ రకాల పోస్టర్స్, స్లోగన్లను కూడా డిస్‌ప్లే చేశామన్నారు.

జిల్లాలో ఉన్న ఎన్జీవోలు, హెచ్‌ఐవీ మీద పనిచేసే సిబ్బంది సహకారంతో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్, సుఖవ్యాధులు పట్ల అవగాహనతో ఎక్కువ మంది హెచ్‌ఐవీ రక్త పరీక్షలు చేసుకునేలా ముందుకు రావడం జరుగుతుందన్నారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల ఉన్న చిన్నచూపు, వివక్షతను రూపు మాపేందుకు హెచ్‌ఐవీ ఎయిడ్స్ ఆక్ట్ 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097పై అవగాహన కల్పించడం ద్వారా ద్వారా వారి వివక్షను తగ్గించి వారి జీవిత కాలాన్ని పొడిగించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ రాష్ట్ర స్థాయి ప్రచారాన్ని అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, హెల్త్ క్యాంపుల ద్వారా లైన్ డిపార్టుమెంట్ల సహాయంతో గ్రామాలు, అర్బన్ ఏరియాలు, కాలేజీలలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. డీఆర్వో కె.వినాయకం, వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి, ఎన్జీవో హాండ్స్ ఆఫ్ కంపాషన్ పీడీ ఆనంద్ బెంజిమన్, టీఐ ప్రోగ్రాం మేనేజర్ ఉదయరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ విజేత హర్షవర్ధన్‌చారి



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలో విజేతలతో నిర్వాహకులు

నరసరావుపేట రూరల్: రాష్ట్ర స్థాయి చెస్ పోటీల విజేతగా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన హర్షవర్ధన్‌చారి నిలిచారు. కేసానుపల్లిలోని ఎంఏఎం కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ ఆదివారం అర్ధరాత్రి ముగిసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 350 మంది చెస్ క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఏడు రౌండ్లలో పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఏఎం కళాశాలల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్, ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణలు పర్యవేక్షించారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతిని హర్షవర్ధన్‌చారి(కడప), ద్వితీయ బహుమతి పి.వెంకటరమణ(అనంతపురం), కె.క్రాంతికిరణ్ (మాచర్ల) నిలిచారు. పోటీలలు విజేతలకు రామశేషగిరిరావు, డాక్టర్ నెల్లూరి రమేష్ నగదు బహుమతితో పాటు షీల్డ్‌లు అందజేశారు.

పోటాపోటీగా ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- పురుషుల విభాగంలో గుంటూరు..
- మహిళా విభాగంలో విజయనగరం జట్టు విజయం



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ఇన్నారెడ్డి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గుడ్ షపర్డ్ పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ముగిశాయి. విజేతలైన వారికి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నా రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పురుషుల విభాగంలో గుంటూరు, మహిళా విభాగంలో విజయనగరం జట్లు విజయం సాధించి ప్రథమస్థానంలో నిలిచాయి. పురుషుల విభాగంలో రెండవ స్థానంలో అనంతపురం, మూడవ స్థానంలో నెల్లూరు, నాల్గవ స్థానంలో విజయనగరం జట్లు నిలిచాయి. మహిళా విభాగంలో రెండవ స్థానంలో అనంతపురం, మూడవ స్థానంలో గుంటూరు, నాల్గవ స్థానంలో కర్నూలు జట్లు నిలిచాయి. వీరిలో జాతీయ స్థాయిలో ఆడే జట్లను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరసింహా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చిరంజీవి, సురేష్, రాధాకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డును నీరుగార్చే యత్నాన్ని తిప్పికొడతాం

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి బాజి



నాదెండ్ల: ముస్లింలకు ఆస్తిగా ఉన్న వక్ఫ్‌బోర్డును కేంద్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నదని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, ముస్లింలతో పాటూ అభ్యుదయవాదులు వ్యతిరేకించాలని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజి చెప్పారు. తూబాడులోని ఆయన నివాసంలో సోమవారం మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ముస్లిం సమాజానికి అండగా ఉంటా మని చెప్పిన పార్టీలు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నోరు విప్పలేదన్నారు. ఏపీలో ముస్లింల తరపున అండగా నిలబడి బిల్లు సవరణకు వ్యతిరేకంగా ఓటు వేసిన వైఎస్సార్ సీపీకి ధన్యవాదాలు తెలిపారు. ముస్లింలకు అన్యాయం జరగకుండా కలిసివచ్చే రాజకీయ పార్టీలను కలుపుకుని పోరాటం చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్సై తండ్రి మృతి



శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారి మార్గంలో హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై లేళ్ల లోకేష్‌రావు కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలో శుభకార్యం ముగించుకొని తిరిగి గుంటూరు వస్తున్న ఓ కుటుంబ సభ్యుల కారు పోట్లూరు గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లు (60) ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని ప్రత్యేక వాహనంలో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ వెంకటేశ్వర్లు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి ముగ్గురు సంతానం. మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు వెంకటేశ్వర్లు కుమారుడు ప్రస్తుతం కొల్లూరు మండల ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు.

జెడ్పీటీసీ ఇంటిపై దాడి కేసులో 10 మందిపై కేసు

పెదకూరపాడు: మండల మహిళ జెడ్పీటీసీ ఇంటిపై గ్రామానికి చెందిన 10 మంది దాడి చేసిన విషయం తెలిసిందే. జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి ఫిర్యాదు మేరకు ఇంటిపైకి వచ్చిన నెల్లూరి వెంకటేశ్వర్లు, ఉట్లపల్లి శ్రీనివాసరావు, ఉట్లపల్లి కోటేశ్వరరావు, మక్కెల ప్రభాకరరావు, కొంకా శౌరీలతో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విపర్ల వెంకట్రావు తెలిపారు.

ఉద్యమాలకు ఉపాధ్యాయ సంఘాలు సిద్ధం కావాలి

యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్

నరసరావుపేట: నూతన జాతీయ విద్యా విధానాన్ని సమీక్షించి అశాస్త్రీయ అంశాలు మూఢ నమ్మకాలను పెంచే సిలబస్, చరిత్రను వక్రీకరించే అంశాలను తొలగించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఎస్.టి.ఎఫ్.ఐ 25వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగంలో ఫెడరలిజం స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ కేంద్రం పెత్తనం చేస్తుందన్నారు. నూతన విద్యా విధానం పేరిట విద్యారంగం కార్పొరేటీకరణ వైపు నెట్టబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జరిగితే బడుగు బలహీన వర్గాలకు విద్య అందని పరిస్థితి భవిష్యత్తులో దాపురించే ప్రమాదం పొంచి ఉందన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా భావ సారూప్యత కలిగిన అనేక రాష్ట్రాల్లోని ఉపాధ్యాయ సంఘాలన్నీ కలిసి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహనరావు, ప్రాంతీయ శాఖల బాధ్యులు ఓ. కోటేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, పి.సత్యానంద్ పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో హాషిస్‌కు సిల్వర్ మెడల్

మంగళగిరి: జాతీయస్థాయి స్కేటింగ్‌లో మెరుగుపాల హాషిస్ సిల్వర్ మెడల్ సాధించాడు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు సమీపంలోని పొల్లాచిలో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలు ఈ నెల 7వ తేదీ నుంచి 11 వరకు నిర్వహించారు. మంగళగిరి– తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డొల్లాస్ నగర్‌కు చెందిన మెరుగుపాల హాషీస్ ప్రతిభ చూపాడు. అండర్– 14 జూనియర్ విభాగంలో హాషిస్ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.